# దరిద్ర ఘోష X

రచన :
"చంద్రిక"

బాబూ....!

నా కొడుకు వృద్ధిలోకి వచ్చి, పెద్దచదువులు చదివి, మంచి ఉద్యోగం చేస్తూ, రెండు చేతులా సంపాదిస్తూ సుఖపడుతూంటే చూసి సంతోషించాలనీ, ఆ సౌఖ్యంలో నేనూ పాలు పంచుకోవాలనీ నాకు మాత్రం లేదంటావా?

నిన్ను ప్రయోజకుణ్ణి చేయలేకపోతున్నానే అనేబాధ నా గుండెల్లో కుంపట్లు వులిగిస్తున్నట్లు నీకెలా తెలుస్తుంది?

బాగానే ఉన్నదిరా బాబూ నీ కోరిక! అయితే నీ కోరిక తీరే మార్గమేది? నేనెలా తీర్చగలననుకుంటున్నావు? అసలు యీ దౌర్భాగ్యుడికి కొడుకుగా ఎందుకు పుట్టావు? అందుకే అనుభవించు యీ శిక్ష!

అయినా యిటువంటి విషయాలు ఒకళ్ళు చెప్పవలసినవి కావు. ఎవరికివారే ఆలోచించి నిర్ణయించుకోవలసిందే! అందుకనే చెప్పినమాట విని నీ మనస్సాక్షిగా ఉన్న పరిస్థితి ఆలోచించుకుని ఓ నిర్ణయానికి రమ్మని నేనంటున్నది!

అది సరే! ఒకవేళ నువ్విలా మొండికెత్తుతున్నావని నిన్ను కాలేజీలో జేరుస్తానే అనుకో- నేనా బాధ్యతతీరా నిర్వహించగలనంటావా?

మన కుటుంబ పరిస్థితి నీకు తెలియనిదేమున్నది? నువ్వే చెప్పు? నువ్వు చూస్తూ గూడా అలా మొండికెత్తితే నేనేం చెప్పగలను? యిప్పటి మన కుటుంబ పరిస్థితుల్లో నిన్ను కాలేజీలో చేర్పించి, ఆ ఖర్చు భరించగల సామర్థ్యం నాకున్నదీ లేనిదీ నీకు తెలియదూ?

మరి - అన్నీ తెలిసికూడా అలా మొండికెత్తటం ఏమిటీ? చెప్పు?

మనకేమైనా తాతలు సంపాదించి పెట్టిపోయిన ఆస్తిపాస్తులున్నాయా? నా ఒక్కడి రెక్కలమీద మన సంసారం యావత్తూ గడవాల్సిఉందే!

నా సంపాదన ఎంతో కూడా నీకు తెలుసాయెను! దానితో మన కుటుంబమెలా గడుస్తున్నదో కూడా తెలుసుగా!?

మరి—అలాంటి పరిస్థితిలో వందలూ వేలూ పోసి నిన్ను కాలేజీలో చదివించే తాహతు నాకెక్కడిదని నువ్వనుకుంటున్నావు?

కనుక నా మాటవిని ఏదైనా చిన్న గుమాస్తా ఉద్యోగం చూసుకుని—కళ్ళు మూసుకుని కాలం గడపటం ఎంతైనా మనకి మంచిది.

మరేం చేస్తాం... కాలం కలిసిరానప్పుడు?

ఏదో కుర్రవాడివి కనుక అలా ఆవేశపడుతున్నావు. ఆ గుమాస్తా ఉద్యోగంలో చేరి కొన్నాళ్లు నలిగితే... ఆవేశం గీవేశం... అన్నీ పోతాయి. దానికి అలవాటు పడితేసరి! అనుభవం జీవితాన్ని అనుభవించటం నేర్పుతుంది!

నేనూ మొదట్లో నీలాగే ఎన్నో పసిడికలలుకన్నాను. మా నాన్న గూడా-యిప్పుడు నీకు నేను చెబుతున్నట్టే నాకూ ఎంతో బోధపడాలని చూశాడు. కానీ నాకవేమీ పట్టలేదు!

నేను కన్న కలలన్నీ నా కళ్ళముందే కల్లలైపోతాయనుకుంటే, నాకు పిచ్చెత్తినట్టయింది. లోకంమీద, బ్రతుకుమీద రోత పుట్టింది.

మా నాన్న చెప్పాడు—'అదే బాబూ! మనం దురదృష్టజాతకులంరా! లోకంలో రెండేరెండు కులాలు; ఒకటి అదృష్టవంతుల కులం, మరొకటి దురదృష్టవంతుల కులమూను. మన కులధర్మం ధరిద్రం!

కష్టాలు, కన్నీళ్ళు మన కర్తవ్యాలు. కనక నాయనా! మన కులధర్మాన్ని పరిత్యజించటం తగదు. తలదాల్చవలసిందే! —కాదన్నా వీలులేదు! తప్పదు!'—అని హెచ్చరించాడు కూడాను.

కాని నా ఆశయాలు నెరవేర్చుకోవాలనే పట్టుదల నాలో విజృంభించింది. చెప్పా పెట్టకుండా దేశంమీదకు పడిపోయాను.

ఇల్లు విడిచిపెట్టి పోతూనన్నమాటేగాని, నా ఆశయాలు ఎలా తీరతాయో నా కవకాహన కాలేదు. ఎక్కడో ఎలాగో నా ఆశయసాఫల్యం సిద్ధిస్తుందనే ఆశ! అలా ఊళ్లు పట్టుకుని ఎన్నాళ్ళు తిరిగానో నాకే తెలియదు. ఎన్నాళ్లు తిరిగినా నా మనస్సులోని కోరిక సిద్ధించనే లేదు. పైనా నా పొట్టగడవటమే ఓ సమస్య

అయిపోయింది. నా ఆశయాలు అడుగంటాయి. అసలు వాటిసంగతే మరచాను. నా ఉదరపోషణకై నానా అవస్థలూ పడి, చివరికి అవి భరించలేకపోగా, యింటికి చేరితే హాయిగా బ్రతకవచ్చుననిపించింది.

అంతే; యిల్లు చేరాను.

'అవునురా! నువ్వు తిరిగి ఎటూ వస్తావని నాకు తెలుసు—వెళ్లేటప్పుడు వెళ్తావని గూడా తెలుసు. అయితే నీకు అప్పుడు నేనుచెప్పి ప్రయోజనం లేదు. ఆ పరిస్థితిలో నువ్వు నా మాటలు అర్థం చేసుకునే స్థితిలో లేవని ఊరుకున్నాను. వెళ్ళి అనుభవిస్తేగాని అసలు సంగతి నీకూ బోధపడదు మరి! యిప్పుడు చూడు కుక్కినపేనులాగా తిరిగి రానూవచ్చావు. రేపు నేను చూపించే గుమాస్తా ఉద్యోగంలోనే—కిక్కురు మనకుండా చేరనూ చేరతావు'' అన్నాడు నాన్న నవ్వుతూనే!

ఆరోజునే నా వెఱ్ఱి ఆశయాలకు, ఆవేశాలకు తిలోదకాలు వదిలాను. మా నాన్న చూపించిన ఉద్యోగంలో కిక్కురుమన కుండా చేరాను. జీవితాన్ని నెట్టుకుని, ఎదురు దెబ్బలను లెక్క చెయ్యకుండా, బరువును గుర్తించకుండా, బాధ్యతలను విసర్జించకుండా, కాలం తీసుకు వెళ్లేగమ్యానికి, ఎదురు ప్రశ్న వేయకుండా వెళ్తున్నాను.

నా అనుభవమే నాకు పాఠం చెప్పింది. ఏదో సాధించాలనే వెఱ్ఱి ఆశ మాకు చావు దెబ్బ కొట్టింది. అదే సంగతి!........

......మళ్ళీ అదే వద్దన్నది! వాళ్ళెవళ్ళతోనో మనకి పోటీ ఏమిటి? వెఱ్ఱిగాక పోతేను!

మా నాన్న చెప్పినట్టు మనం దురదృష్ట జాతికులం వాళ్ళు అదృష్టకులం వాళ్ళూను. వాళ్ళకి మనకి పొత్తెక్కడ? వాళ్ళు కాలేజీల్లో చేరతారు. లండను వెళ్ళి తిరిగి వస్తారు! అది మనవల్ల నయేపనేనా అని మనం ఆలోచించిమరీ మొదలెట్టాలి ఏపని మొదలెట్టినానూ!

కనుక - నేను చెప్పవలసిందేదో చేప్పేశాను. మన వల్లకాదురా అబ్బాయ్ అంటున్నాను. నేనా మాట ఎందు కంటున్నానో నువ్వే ఆలోచించి తేల్చుకోవలసిన సంగతి!

.........ఆఁ! ఆఁ! ఎంతకు తెగించావు? మేము ఉండగానే అంత పనిచేస్తావటరా!

అవునులే! నీబాగు నీకు కావాలి! మాపరువు ప్రతిష్టలు నీకెందుకు? మరి...నీ బాగుకోసమే - వారాలు చేసుకుంటావు-అడుక్కునీ తింటావు! తివకేం చేస్తావు? మన కుటుంబ గౌరవ ఎలామట్టి పాలైతే నీకెందుకు?...

...నాకు కోపం తెప్పించకు మరి!......నువ్విలా మంచీ మర్యాద లేకుండా మాట్లాడితే ఎలాగు?......

ఏమిటో...క్షణంలోకోపం...మరుక్షణంలోదుఃఖం! యీ వెఱ్ఱివాడిని ఎక్కువగా వాగించబోకు నాయనా! -

ఇక నీ యిష్టంర్రా బాబూ!

నేను చెప్పవలసిందేదో చెప్పాను.

లాభనష్టాలు విచారించుకుని నిరుపమయిన దారి ఎన్నుకోనవలసిన వాడివి నువ్వు! నేను చెప్పిన దానికన్న మంచిదని నీకు తోచినదారి నిరభ్యంతరంగా అవలంభించు. నేనూ హృదయ పూర్వకంగా దీవిస్తాను. అయితే అది నేను చూపినదారికంటె మంచిదవటమే నాకు ఆనందకరమూ, నీకు లాభదాయకమూను!

యింతకంటే నీకు నేను చెప్ప దగ్గదిలేదు. చెయ్య దగ్గది అంతకంటె లేదు.

నువ్వే ఓదారి ఏర్పరుచుకో!

నీ ప్రయత్నంలో నువ్వు కృతకృత్యుడు కావాలని కోరుకుంటున్నాను. ప్రయత్నించు!!

—'చంద్రిక'


# కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితము 1938.

విడి ప్రతి. — 25 న. పై.

సంవత్సర చందా. — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్సులలోనూ దొరుకును.